సాక్షి
కామారెడ్డి
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



ఓటీఎస్ అమలు..

మే 1వ తేదీనుంచి జూన్ 30వ తేదీ వరకు వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం అమలు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸



పనులు పూర్తి చేయాలి

'మన ఊరు మన బడి'లో చేపట్టిన పనులను మే 31లోపు పూర్తి చేయాలని టీఎస్‌ఈడబ్ల్యూ డీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /19.8

వాతావరణం

ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు కేంద్ర మంత్రి రాక

కామారెడ్డి టౌన్: కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా గురువారం జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈ విషయాన్ని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించే జహీరాబాద్ పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు సిరిసిల్ల రోడ్‌లో ఆయనకు స్వాగతం పలుకుతామని, అక్కడి నుంచి ర్యాలీగా లక్ష్మీదేవి గార్డెన్‌కు వెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనాలని కార్యకర్తలను కోరారు.

సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను మేడ్చల్ –మల్కాజ్‌గిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మేడ్చల్ –మల్కాజిగిరి నుంచి బి.శ్రీదేవి రానున్నారు.

రైతులు అధైర్యపడొద్దు

నిజామాబాద్‌నాగారం: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నష్టపోయిన పంటల వివరాలు సేకరించాలని నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రేపటి వరకు పూర్తి వివరాలు తెప్పించుకుని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు తగిన సహాయం అందేలా చూస్తామన్నారు.

పోలీస్ స్టేషన్ల తనిఖీ



ఎల్లారెడ్డి/లింగంపేట: ఎల్లారెడ్డి, లింగంపేట పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఎల్లారెడ్డిలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ ఆయా స్టేషన్‌లలో రికార్డులను తనిఖీ చేశారు. నేరాల సంఖ్య అదుపులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

కామారెడ్డి రూరల్: గర్గుల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సందర్శించారు. తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. ఎండబెట్టి శుభ్రపరచిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లై జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, అధికారులు ఉన్నారు.

4,910 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం కంటి వెలుగులో 4,910 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 386 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 3,42,464 మందికి కంటి పరీక్షలు చేసి, 51,135 మందికి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు.

విద్యావర్ధినిపై సస్పెన్షన్..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్సిటీ వృక్ష శాస్త్రం ప్రొఫెసర్ విద్యావర్ధినిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ పాలకమండలి తీర్మానించింది. బుధవారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో టీయూ పాలకమండలి సమావేశం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ ఆధ్వర్యంలో జరిగింది. వీసీ ప్రొఫెసర్ రవీందర్ హాజరు కాకపోవడంతో వాకాటి కరుణ సమావేశానికి చైర్మన్‌గా వ్యవహరించారు. పాలకమండలి అనుమతి లేకుండా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన విద్యావర్ధిని పదవీ కాలాన్ని గుర్తించేది లేదని తీర్మానించారు. పైగా వీసీ విచ్చలవిడిగా చేపట్టిన అక్రమ నియామకాలు, ఆర్థిక అవకతవకల్లో పాలుపంచుకుని ఇష్టారీతిన సంతకాలు పెట్టినందున విద్యావర్ధినిని ప్రొఫెసర్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ తక్షణం అమలులోకి వస్తుందని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ప్రకటించారు. విద్యావర్ధిని నిర్దోషిగా నిరూపించుకుంటేనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. మరోవైపు అక్రమ మార్గంలో రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్న అకడమిక్ కన్సల్టెంట్ శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ పాలకమండలి తీర్మానించింది. వర్సిటీలో వీసీ రవీందర్, విద్యావర్ధిని పాల్పడిన అవకతవకలకు సంబంధించి ఏసీబీకి సైతం ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.



కొండాపూర్‌లో పొలం మడిలోనే నానిపోయిన మక్క కంకులు



గుండారం నడిమి తండా కొనుగోలు కేంద్రం వద్ద నానిపోయిన వడ్ల కుప్పలు



పిట్లం మండలం బండపల్లిలో దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతులు

వెన్ను విరిచిన వాన!

వడగండ్ల వాన రైతు వెన్ను విరిచింది. చేతికొచ్చిన పంటను నేలపాలు చేసింది. అకాల వర్షంతో వేలాది ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. పంట నష్టానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- వడగండ్లతో రాలిపోయిన వరిగింజలు
- కల్లాల్లో తడిసిపోయిన ధాన్యం
- వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ఆత్మహత్యకు యత్నించిన రైతు
- ఆదుకోవాలంటూ అన్నదాతల ఆందోళనలు

సాక్షి, కామారెడ్డి: యాసంగిలో ఎన్నో ఆశలతో పంటలు సాగు చేసిన రైతులను సీజన్ అంతా తెగుళ్ల ఇబ్బందిపెట్టాయి. ఎలాగోలా పంట చేతికొచ్చింది, కనీసం పెట్టుబడులైనా దక్కుతాయని ఆశతో ఉన్న రైతులను అకాల వర్షం నిండాముంచింది. జిల్లాలో మంగళవారం కురిసిన వడగండ్ల వర్షం కోలుకోలేకుండా చేసింది. లింగంపేట, రాజంపేట, కామారెడ్డి, దోమకొండ, బీబీపేట, గాంధారి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, బీర్కూర్, బాన్సువాడ, నిజాంసాగర్, పిట్లం తదితర మండలాల్లో కోతకొచ్చిన వరి పంట భారీగా దెబ్బతింది. వరి గింజలన్నీ నేలరాలాయి. చాలాచోట్ల వరిగింజలు రాలిపోయి గడ్డి మిగిలింది. దీంతో రైతులు కంటతడిపెట్టారు. ఆరుగాలం శ్రమ వృథా అయ్యిందంటూ ఆవేదన చెందారు.

జిల్లాలో పక్షం రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెడుతున్నారు. కొందరు రైతులు రోడ్లపై, మరికొందరు కల్లాల్లో ఆరబెట్టారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా, ఇంకా తూకాలు మొదలుకాలేదు. దీంతో కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. ఒక్కసారిగా దంచికొట్టిన వర్షంతో వడ్లన్నీ నానిపోయాయి. కొన్నిచోట్ల వడ్లు వర్షానికి కొట్టుకుపోయాయి. కామారెడ్డి మండలంలోని పాతరాజంపేట, నర్సన్నపల్లి, నరంపల్లి, చిన్నమల్లారెడ్డి, రాజంపేట మండలంలోని పొందుర్తి, రాజంపేట, శివాయిపల్లి, రాజంపేట, కొండాపూర్, అర్గొండ, నాగిరెడ్డిపేట మండలంఒని రాఘవపల్లి, బాన్సువాడ మండలంలోని బోర్లం, తాడ్కోల్, మొగులాన్‌పల్లి, లింగంపేట మండలం కొయ్యగుండు తండా, బానాపూర్, బోనాల్, ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట, దోమకొండ మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, మాచారెడ్డి మండలం అక్కాపూర్, బీబీపేట మండలం మాందాపూర్, బీబీపేట తదితర ప్రాంతాల్లో వరిపై వడగండ్ల ప్రభావం ఎక్కువగా ఉంది. గాంధారి మండలంలోని కాయితీ తండాలో పిడుగు పాటుతో మంజా జ్యోతిరాజ్‌కు చెందిన రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి.



నాగిరెడ్డిపేట మండలం తాండూర్ శివారులో వర్షపునీటిలో ఉన్న ధాన్యం కుప్పలు



కొటాల్‌పల్లిలో నానిపోయిన ఉల్లిగడ్డలు



నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలంటూ లింగాయిపల్లి చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

రైతు ఆత్మహత్యాయత్నం

వడగండ్లతో పంట దెబ్బతినడంతో నిజాంసాగర్ మండలంలో మెగావత్ చందానాయక్ అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు బాన్సువాడ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు.

32 వేల ఎకరాల్లో నష్టం

అకాల వర్షాలు, వడగండ్లతో జిల్లాలో 32 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 22,060 మంది రైతులకు సంబంధించిన పంటలు దెబ్బతిన్నాయని నివేదికలు రూపొందించారు. 31,814 ఎకరాల్లో వరి, 11 ఎకరాల్లో మక్క, 64 ఎకరాల్లో టమాట, 40 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

కొనుగోలుకేంద్రాల్లో నానిన వడ్లు

జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో పెద్ద ఎత్తున ధాన్యం నానిపోయింది. కొన్నిచోట్ల వడ్లు కొట్టుకుపోయాయి. వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యం నానిపోయింది. అయితే వ్యవసాయ శాఖ కొనుగోలు కేంద్రాల్లో నానిన వడ్ల లెక్కలు అంచనా వేయలేదు. నానిన వడ్లు ఆరగానే కొనుగోలు చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.



ఎల్లారెడ్డిపల్లిలో నీటిలోంచి వరి కట్టలను బయటకు తెస్తున్న రైతు

రోడ్డెక్కిన రైతులు..

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలంటూ జిల్లాలోని పలు ప్రాంతాలలో రైతులు రోడ్డెక్కారు. కామారెడ్డి మండలం లింగాయపల్లి, పాతరాజంపేట గ్రామాల్లో రాస్తారోకో చేశారు. రాజంపేట మండల కేంద్రంలో కూడా రైతులు రాస్తారోకో నిర్వహించారు. పాతరాజంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులకు అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీ సభ్యురాలు చిదుర రమాదేవి, ఆమె భర్త లక్ష్మారెడ్డి మద్దతు తెలిపారు.

ఓదార్చిన నేతలు, అధికారులు

సాక్షి, కామారెడ్డి: వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పర్యటించారు. పంట దెబ్బతిని ఇబ్బందులపాలైన రైతులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ సుడిగాలి పర్యటన చేశారు. లింగంపేట మండలం లింగంపల్లి శివారులోని కొయ్యగుండు తండా, భిక్కనూరు మండలంలోని జంగంపల్లి, దోమకొండ మండలంలోని దోమకొండ, ముత్యంపేట, బీబీపేట మండలంలోని మాందాపూర్‌లలో పంటలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ నియోజకవర్గంలో పర్యటించి, వడగండ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్‌అలీలు పొందుర్తి శివారులో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కామారెడ్డి, రాజంపేట, దోమకొండ తదితర మండలాల్లో బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పర్యటించి రైతులను ఓదార్చారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ లింగంపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి లింగంపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు.

బోరుమన్న అన్నదాతలు..

దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి వెళ్లిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకుల దగ్గర మహిళా రైతులు బోరుమన్నారు. ఆరుగాలం కష్టం నీళ్లపాలైందని రోదించారు. రాత్రింబవళ్లు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డ తమకు ఆఖరుకు వడగండ్లు కోలుకోలేని దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు దెబ్బతిని రోడ్డున పడ్డామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు.



చింతల్‌గుట్ట తండాలో రైతు రవిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే సురేందర్

కలెక్టర్‌ను అడ్డుకున్న రైతులు

దోమకొండ: వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి వచ్చిన కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను రైతులు దోమకొండలో అడ్డుకున్నారు. కలెక్టర్ షెడ్యూల్ ప్రకారం దోమకొండ మండల కేంద్ర శివారులో రాళ్ల వానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి అనంతరం ముత్యంపేట గ్రామంలో పంటలను పరిశీలించాల్సి ఉంది. కానీ కలెక్టర్ వస్తున్న విషయం తెలుసుకున్న రైతులు ముత్యంపేట రోడ్డులో పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఆయన కాన్వాయ్‌ను అడ్డుకుని తమ పంటలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. దీంతో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ కలెక్టర్‌తో మాట్లాడి, రైతు వేదిక వద్ద ధాన్యాన్ని పరిశీలించాలని కోరారు. కలెక్టర్ రైతు వేదిక వద్దకు వెళ్లి, ధాన్యాన్ని పరిశీలించి, రైతుల బాధలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కంటతడిపెట్టారు. నాలుగు నెలల కష్టం వర్షార్పణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ రైతులను సముదాయించారు. ఏఈవోలతో సర్వే చేయించి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తానన్నారు.



దోమకొండలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ పాటిల్

'ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చూస్తాం'

బాన్సువాడ రూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించడానికి కృషి చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ మండలంలో వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. తాడ్కోల్, మొగులాన్‌పల్లి, కొయ్యగుట్ట శివార్లలో పంట నష్టపోయిన రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మనోధైర్యాన్ని కోల్పోవద్దన్నారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో వెంటనే సర్వేచేయించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గతేడాది పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సాయం అందిందని, ఈసారీ అందేలా చూస్తామని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కాంటా అయిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించామన్నారు.

నష్టాన్ని నివారించడానికి..

తెలంగాణలో ఏటా నవంబర్, ఏప్రిల్ మాసాల్లో తుఫాన్లు, వడగండ్ల వానలు పడతాయని స్పీకర్ అన్నారు. ప్రకృతి విపత్తులను తప్పించలేమని, ఆలోచిస్తే నష్టాన్ని తప్పించవచ్చని పేర్కొన్నారు. పంట కాలాన్ని ముందుకు జరుపుకోవాలని రైతులను చేతులెత్తి కోరుతున్నానన్నారు. ఎండాకాలం పంటకు నవంబర్‌లో నారు పోసుకుంటే మార్చిలో కోతలు పూర్తి చేసుకోవచ్చన్నారు. వానాకాలానికి సంబంధించి రోహిణి కార్తెలోనే నారు పోసుకుంటే అక్టోబర్‌లో కోతలు పూర్తై నవంబర్‌లో సంభవించే తుఫాన్లనుంచి తప్పించుకోవచ్చని సూచించారు. ఆయన వెంట రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, ఏడీఏ వినయ్‌కుమార్, ఏవో సుధాకర్, ఏఈవో గోపాల్, నాయకులు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, గంగుల గంగారాం, ముఖీద్, కమ్మరి రాజు, లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.



తాడ్కోల్ శివారులో పంటను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

'రెండు రోజుల్లో నష్ట పరిహారమివ్వాలి'

కామారెడ్డి టౌన్: అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు రెండో రోజుల్లో నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నర్సన్నపల్లితో పాటు పలు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వడగండ్ల వానతో నియోజకవర్గం దాదాపు 10 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేసి ఉంటే రైతులకు న్యాయం జరిగి ఉండేదన్నారు. కలెక్టర్, వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వెంటనే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు తేలు శ్రీనివాస్, అన్నండ్ల సురేశ్, విపుల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

'సకాలంలో పనులు పూర్తి చేయాలి'

కామారెడ్డి టౌన్: ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ సకాలంలో నిర్దేశిత ఎన్నికల పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి రవికిరణ్ సూచించారు. ఓటర్ జాబితాలో ఎఫ్‌ఎల్‌సీ, పీఈటీ తొలగింపు, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ తదితర అంశాలపై వారు బుధవారం హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ని యోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించేందుకు ప్రతిపాదనలను మూడు రోజులలో పంపాలన్నారు. జూన్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ల ఎఫ్‌ఎల్‌సీ నిర్వహించాలని, పార్టీలకు ముందస్తు స మాచారం అందించి వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఓటింగ్ తక్కువ నమోదైన ప్రాంతాల్లో ఓటు ప్రాముఖ్యత కార్యక్రమాలను వినూత్నంగా నిర్వ హించేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. గరుడ యాప్‌లో ప్రతి బూత్ స్థాయి అధికారి తప్పనిసరిగా లాగిన్ అయ్యేలా ఈఆర్‌వోలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమా వేశం అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మా ట్లాడారు. ప్రతి శనివారం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితాలో మార్పులు, ఎన్నికల కమిషన్ సూచనలను వివరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎన్నికల సూపరింటెండెంట్ సాయి భుజంగరావు, ఎన్నికల అధికారులు శ్రావణి, ఇందిర ప్రియదర్శిని పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వైద్యుడికి మెమో

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ వైద్యుడు హరిసింగ్‌కు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి బుధవారం మెమో జారీ చేశారు. ఇటీవల జరిగిన జెడ్పీ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ జిల్లా ఆస్పత్రిలో సేవలపై పలు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో వైద్యుడు హరిసింగ్‌కు మెమో ఇచ్చి, విచారణ జరిపించనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

వైద్యుడి రాజీనామా

కాంట్రాక్ట్ వైద్యుడు హరిసింగ్ బుధవారం రాజీనామా లేఖను సూపరింటెండెంట్‌కు అందించారు. తాను తప్పు చేయకున్నా, ఒక ప్రజాప్రతినిధి ఆరోపణలపై మెమో జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 13న రాత్రి విధుల్లో ఉన్నప్పుడు ఓ ప్రజాప్రతినిధి మద్యం సేవించి వచ్చి తనతో దురుసుగా ప్రవర్తించాడని, తాను అతడిని గుర్తుపట్టక నమస్కారం పెట్టనందుకు కక్షగట్టాడని ఆరోపించారు. దీంతో జెడ్పీ సమావేశంలో తనపై అసత్యపు ఆరోపణలు చేశారన్నారు. వేడి టీ పడిన ఘటనలో చిన్నారికి మెరుగైన వైద్యం అందించామన్నారు. కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఓపెన్ బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్అర్బన్: డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. మే 22వ తేదీలోగా బీఈడీ, స్పెషల్ బీఈడీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు రూ.750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్ 6న ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందన్నారు. అలాగే ఓపెన్ వర్సిటీ డిగ్రీ ఫీజును మే 10 నుంచి చెల్లించాలని సూచించారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీఈడీ పరీక్షలకు 67 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 1303 మంది విద్యార్థులకు 1236మంది హాజరు కాగా 67 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. అలాగే బీపీఈడ్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 35మంది విద్యార్థులకు 31 మంది హాజరు కాగా 4 గురు గైర్హాజరైనట్లు తెలిపారు.

పిడుగుపడి మక్కజూడు దగ్ధం



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌లో బుధవారం వేకువజామున పిడుగు పడింది. గ్రామానికి చెందిన వంగేటి ధర్మవ్వ వ్యవసాయక్షేత్రంలో ఉన్న మక్క జూడుపై పిడుగుపడటంతో కాలిపోయింది.

మూడు షాపులు దగ్ధం

ఎడపల్లి: ఎడపల్లిలో బుధవారం తెల్లవారుజామున మూడు షాపులు దగ్ధమై రూ.ఏడు లక్షల నష్టం జరిగిందని బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజు తెలిపారు. ఎడపల్లికి చెందిన అఖిల్ బైక్ మెకానిక్ షాపు కాలిపోయి రూ.నాలుగు లక్షలు, రహీంకు చెందిన పాత ఇనుప సామన్ల షాపు దగ్ధమై రూ.2 లక్షలు, రవికి హెయిర్ కటింగ్ షాపు దగ్ధమై రూ.50వేలు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా గుర్తు తెలియని వ్యక్తులే నిప్పు పెట్టినట్లు షాప్ యజమానులు ఆరోపిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు బోధన్ రూరల్ సీఐ తెలిపారు.

తమ్ముడి హత్య కేసులో జైలుశిక్ష

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌కు చెందిన మక్కల రాజును హత్య చేసిన అతడి అన్న మక్కల శ్రీనివాస్,అతని భార్య మక్కల సుశీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల బుధవారం జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు తెలిపారు. పట్టణంలోని కమలా నెహ్రూ కాలనీకి చెందిన మక్కల రాజుకు తల్లి తండ్రులు లేక పోవడంతో సోదరుడు మక్కల శ్రీనివాస్ వద్ద నివాసముంటున్నాడు. తనకు వివాహం చేయమని రాజు నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ పడేవాడు. ఈ క్రమంలో 2021 మే 12న మద్యం మత్తులో గొడవ పడిన రాజును అన్న శ్రీనివాస్ అతని భార్య సుశీలతో కలిసి తలపై కర్రతో బాది హత్య చేశారు. మృతుడి సోదరి రజిత ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేశారు. జిల్లా కోర్టులో బుధవారం కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడు మక్కల శ్రీనివాస్‌కు పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా, సుశీలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించారు.

లక్ష్యాలను చేరుకోవాలి





సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న చిన్నారులు

- అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్
- 'సాక్షి' చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన



సుభాష్‌నగర్: విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆసక్తి ఉన్న క్రీడలను ఎంచుకుని సద్వినియోగం చేసుకోవాలని, కలలుగన్న లక్ష్యాన్ని చేరుకోవాలని అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ సూచించారు. బుధవారం నగరంలోని కాకతీయ ఒలంపియడ్ స్కూల్‌లో సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోటీల్లో అందరూ విజేతలేనని, బహుమతి రాలేదని ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారని, మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో ప్రతి విద్యార్థి డాక్టర్, ఇంజనీర్‌గా స్థిరపడాలని కోరుకుంటున్నారని, పొలిటీషియన్‌గా కూడా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రజలకు సేవ చేసేందుకు పొలిటీషియన్ రంగం ఎంతో ఉత్తమమైందన్నారు. గతంలో ఇంటర్నెట్ అనేది చాలా అరుదని, ప్రస్తుతం ఇంటర్నెట్ సదుపాయం ప్రతి ఇంట్లోనూ అందుబాటులో ఉందన్నారు. ఇంటర్నెట్ విద్యార్థులకు ఎలాగైతే మేలు చేస్తుందో.. అంతే చెడు వ్యసనాలకు లోనవుతున్నారని పేర్కొన్నారు.



సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

వేసవి సెలవులను విద్యార్థులు సరదాగా గడుపుతూనే సద్వినియోగం చేసుకోవాలని కాకతీయ ఒలంపియడ్ స్కూల్ డైరెక్టర్ రామోజీరావు సూచించారు. ప్రస్తుతం నేర్చుకునే దశలో ఉన్నారని, సమయాన్ని వృథా చేయవద్దని తెలిపారు. సెల్ ఫోన్లు, ఆన్‌లైన్ గేమ్స్, ఇతరత్రా వాటికి దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. విద్యార్థి దశలో మెదడు చురుకుగా పని చేస్తుందని, నేర్చుకున్న ప్రతి అంశం గుర్తుంటుందని సూచించారు. లక్ష్యం కోసం సాధన చేయాలన్నారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సాక్షి, ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ నటరాజ్, అనంత్, బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి ప్రభాకర్, ఆర్‌సీ ఇన్‌చార్జి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకుంటున్న సులక్ష



మాట్లాడుతున్న కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ రామోజీ



రామోజీకి జ్ఞాపిక అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్



తృతీయ బహుమతి అందుకుంటున్న ఆశ్రిత



'సాక్షి'కి ధన్యవాదాలు



"సమాజం కాలుష్యం బారిన పడకుండా, భూమిని ఎలా రక్షించుకోవాలనే ఉద్దేశంతో చెట్ల అవశ్యకతను తెలియజేస్తూ డ్రాయింగ్ వేశాను. మాలో ఉన్న స్కిల్‌ను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయి. నేను వేసిన డ్రాయింగ్‌కు మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. సాక్షి మీడియా గ్రూప్‌నకు ధన్యవాదాలు.

– శ్రుతి శాస్త్రి, ఎనిమిదో తరగతి, కాకతీయ ఒలంపియడ్ స్కూల్

అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను..



బాల కార్మికుల నిర్మూలన అంశంపై డ్రాయింగ్ వే శాను. చదువుకోవాల్సిన పిల్లలు బడి బయట కార్మికులుగా పని చేస్తున్నారు. రోడ్డుపై వెళ్తున్న క్రమంలో చాలా మందిని గమనించాను. పని చేస్తున్న పిల్లలను చూసినప్పుడే వారి గురించి డ్రాయింగ్ వేయా లని అనుకున్నాను. సాక్షి ఆ అవకాశాన్ని కల్పించడంతో సద్వినియోగం చేసుకున్నాను.రెండో బహుమతి రావడం ఆనందంగా ఉంది. – సులక్ష, ఏడో తరగతి, కాకతీయ ఒలంపియడ్ స్కూల్

సంతోషంగా ఉంది



గ్రామీణ ప్రాంత విశిష్టతను తెలియజేసే డ్రాయింగ్ వేశాను. పల్లె వాతావరణం, తాతయ్యలు, అమ్మమ్మ, నానమ్మలు, చుట్టూ పంట పొలాలు, చెట్లు, పశు సంపద ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలు రాత్రి సమయాల్లో చెప్పే కథల సారాంశమే డ్రాయింగ్. పోటీల్లో మూడో బహుమతి రావడం సంతోషంగా ఉంది.

– ఆశ్రిత, ఏడో తరగతి, అభ్యాస స్కూల్

నైపుణ్యం వెలికితీయడానికి దోహదం



పిల్లల్లో నైపుణ్యం వెలికి తీయడానికి పోటీలు ఎంతగానో దోహదపడతాయి. వేసవి సెలవుల్లో ఒత్తిడికి లోనుకాకుండా రిలాక్స్ కోసం విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల్లో పోటీతత్వం కూడా పెంపొందుతోంది. సాక్షి గ్రూపు మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

– లావణ్య, డ్రాయింగ్ టీచర్

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



వేసవి సెలవుల్లో సాక్షి మీడియా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సెలవుల్లో వీరికి వారి నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశం లభించింది. ఇలాంటివి మరెన్నో నిర్వహించాలి. విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో ఉన్న ఆసక్తిని బయటికి తీయవచ్చు." – శ్రీలత, కళాశాల ఇన్‌చార్జి

మే 1 నుంచి జూన్ 30 వరకు ఓటీఎస్ అమలు

సుభాష్‌నగర్: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రుణం పొందిన రైతుల అభ్యర్థన మేరకు ఏక కాల పరిష్కారం (ఓటీఎస్) గడువును మే 1 నుంచి జూన్ 30 వరకు అమలు చేయాలని నిర్ణయించినట్లు ఎన్‌డీసీసీబీ బ్యాంకు చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం జిల్లా సహకార కేంద్రబ్యాంకులో చైర్మన్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పోచారం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 31, 2023 వరకు కాలపరిమితి ముగిసి బ్యాంకు ద్వారా బట్వాడా చేసిన సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలపై అపరాధ వడ్డీ 100శాతం మాఫీ, వాయిదా మీరిన వడ్డీపై 30శాతం మాఫీ చేస్తామని తెలిపారు. ఎల్‌టీ రుణాలు, మార్టిగేజ్, ఎస్ఎఫ్ఎస్, జేఎల్‌జీ, ఎస్‌హెచ్‌జీ రుణాలపై వడ్డీ 32శాతం మాఫీ చేస్తామన్నారు. మే 1 నుంచి జూన్ 30 వరకు ఈ స్కీమ్ అమల్లో ఉంటుందన్నారు. అర్హులైన రుణగ్రస్తులు ఓటీఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకుని బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వివరాల కోసం సంబంధిత సొసైటీలు, బ్రాంచ్ మేనేజర్లను సంప్రదించాలని కోరారు. వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సీఈఓ గజానంద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చోరీ అయిన సెల్‌ఫోన్ నుంచి రూ.1.32 లక్షలు మాయం

భిక్కనూరు: చోరీ అయిన మొబైల్ నుంచి డబ్బులు మాయం అయ్యాయి. భిక్కనూరుకు చెందిన బోగరి సంతోష్‌కుమార్ ఫోన్ ఆదివారం సంతలో పోయింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం మరో సెల్‌ఫోన్‌ను కొనుగోలు చేసి సిమ్ కార్డు వేశాడు. తన కొత్త ఫోన్‌లో అన్ని యాప్‌లన డౌన్‌లోడ్ చేసుకున్నాడు. తన బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.1.32 లక్షలు మాయమైనట్లు గుర్తించాడు. బ్యాంక్‌కు వెళ్లి విచారించగా యూపీఐ ద్వారా తమిళనాడులోని మరొకరి ఖాతాకు బదిలీ చెప్పారు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అర్ధంతరంగా తొలగిస్తే ఎలా బతకాలి



వీసీ డి రవీందర్‌తో మాట్లాడుతున్న డెయిలీవేజ్ సిబ్బంది

- వీసీని కలిసిన డెయిలీవేజ్ సిబ్బంది
- మంత్రిని, ఎమ్మెల్యేను కలవండి : వీసీ

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటులో విలువైన భూములు కోల్పోయిన తమకు డెయిలీ వేజ్ పేరిట వర్సిటీలో పనులు ఇచ్చినట్లే ఇచ్చి ఇప్పుడు అర్ధంతరంగా తొలగిస్తే తాము ఎలా బతకాలని నడిపల్లి తండాకు చెందిన పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల తర్వాత తెయూ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ క్యాంపస్‌కు వచ్చారు. ఈసీ అనుమతి లేకుండానే వీసీ వర్సిటీలోని మూడు క్యాంపస్‌లలో 147 మందిని డెయిలీవేజ్ పేరిట నియామకం చేసి వారికి వేతనాలు చెల్లించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈసీ అనుమతి లేకుండా వీసీ చేపట్టిన నియామకాలు, పదోన్నతులను రద్దు చేస్తూ ఈసీ సభ్యులు తీర్మానం చేశారు. వెంటనే అక్రమంగా నియమించిన వారందరినీ తొలగించి, పదోన్నతులు రద్దు చేయాలని వారికి చెల్లించిన డబ్బులను రికవరీ చేయాలని ఈసీ నిర్ణయించింది. ఈసీ ఆదేశాల మేరకు నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం యాదగిరి ఈ నెల 20 నుంచి అన్ని విభాగాలల్లో పని చేస్తున్న డెయిలీ వేజ్ సిబ్బంది ఇకనుంచి విధుల్లోకి రావొద్దని ఆదేశాలు జారీ చేశారు. 23 మంది అవుట్‌సోర్సింగ్ పదోన్నతులు రద్దు చేస్తూ వారికి చెల్లించిన అధిక వేతనం డబ్బులను రికవరీ చేస్తామని నోటీసులు జారీ చేశారు. అడ్వాన్స్‌ల పేరిట తీసుకున్న డబ్బులను ఈ నెల 29 వరకు తిరిగి చెల్లించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని వీసీ పీఏలుగా పని చేసిన నలుగురికి రిజిస్ట్రార్ నోటీసులు జారీ చేశారు. అక్రమ నియామకాలు, పదోన్నతులలో లక్షల రూపాయలు ముడుపులు చేతులు మారినట్లు ఇప్పటికే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈసీ మీటింగ్ తర్వాత బుధవారం వీసీ క్యాంపస్ వచ్చిన విషయం తెలియగానే ముందుగా డెయిలీవేజ్ సిబ్బంది వచ్చి ఆయనను కలిశారు. నిరుపేదలమైన తమను గతంలో ఒకసారి ఇలాగే నియమించుకుని తర్వాత తొలగించారని ఇప్పుడు మళ్లీ అలాగే చేస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారమే తాను వారికి పనులు కల్పించానని అయితే స్థానిక ఈసీ మెంబర్లు వారిని తొలగించాలని సంతకాలు పెట్టారని వీసీ తెలిపారు. ఈసీ మీటింగ్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రార్, ఈసీ మెంబర్లు హైదరాబాద్‌కు వెళ్లారని గురువారం వస్తే వారిని పిలిపించి మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని వీసీ పేర్కొన్నారు. లేదంటే జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను వెళ్లి కలువాలని, తాను 300 అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు రికమండ్ చేస్తానని వీసీ తెలిపారు. వారిద్దరూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు సన్నిహితులని అవుట్‌సోర్సింగ్‌గా మీకు నెలకు రూ.25 వేలు వేతనం వస్తుందన్నారు. అయితే తాము ఎవరినీ కలిసేది లేదని మీరే మా సమస్య పరిష్కరించాలని డెయిలీవేజ్ సిబ్బంది డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడదామని చెప్పి వీసీ వారిని పంపించారు.

అడ్వాన్స్ డబ్బులు మేమెలా చెల్లించాలి..

తాము చిన్న ఉద్యోగులమని మీరు చెబితేనే అడ్వాన్స్ పేరిట డబ్బులు తీసుకుని మీకే ఇచ్చామని ఇప్పుడు వాటిని చెల్లించాలని రిజిస్ట్రార్ నోటీసులు జారీ చేశారని వీసీ పీఏలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వీసీ రవీందర్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. అయితే అడ్వాన్స్ తీసుకున్న డబ్బులకు సంబంధించిన బిల్లులు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకోవాలని వీసీ వారికి సూచించారు. అలాగే అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి తాను పదోన్నతులు ఇస్తే ఈసీ రద్దు చేయడం తగదని, తీర్మానాలపై ఇంటర్నల్ ఈసీ మెంబర్లు సంతకాలు ఎలా చేస్తారని వారిని ప్రశ్నించాలని వీసీ సూచించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



మృతి చెందిన బాలయ్య

తాడ్వాయి: తాడ్వాయికి చెందిన పని బాలయ్య(30) జారి పడి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాలయ్య మంగళవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో తన పొలం నుంచి తన ఇంటికి వస్తుండగా గ్రామంలో వడ్ల వెంకటేశం ఇంటి ముందర ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. ఆయన కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న బాలయ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ప్రదీప్, కుమార్తె రక్షిత ఉన్నారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



రాములు మృతదేహం

సిరికొండ : సిరికొండ మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన డప్పు రాములు (50) మృతి చెందాడు. రాములు బంధువైన జలందర్‌తో కలిసి బైక్‌పై మండలంలోని గడ్కోల్‌కు బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. వెనుక కూర్చున్న రాములుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న జలందర్‌కు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.

తాటిపల్లివాసి..

సిరికొండ: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన లింగు ఆనందం(55) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు.. ఆనందం భార్య లక్ష్మీతో కలిసి అత్తగారి ఊరైన వట్టిమల్లలో పెద్దమ్మ పండుగ కోసం వెళ్లాడు. ఇంటి వద్ద మేకలను కట్టేసేందుకని సాయంత్రం ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. వట్టిమల్ల చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు వెనుక చక్రాల కింద పడి మృతి చెందాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రుద్రూర్: మోస్రా మండల కేంద్రానికి చెందిన గోపరి మహేష్ (32) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మూడు రోజుల క్రితం మహేష్ బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో జింక..



మృతి చెందిన జింక

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం ఉదయం కుక్కలు దాడి చేయడంతో జింక మృతి చెందింది. ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని ముళ్ల పొదల వద్ద జింక మృతదేహాన్ని గమనించిన కొందరు విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది వర్సిటీ ఎస్టేట్ ఆఫీసర్ అశోక్‌వర్ధన్, యాదగిరికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని జింక మృతదేహాన్ని ఇందల్వాయి అటవీ అధికారులకు అప్పగించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బీబీపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి నగలు ఎత్తుకెళ్లిన ఘటన బీబీపేటలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రాల సిద్దరాంలు గత నెల 27న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 25న ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూశాడు. వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 16 గ్రాముల బంగారం, అంతే కాకుండా రూ.800 విలువ గల బ్యాటరీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



మద్నూర్: మండలంలోని అంతాపూర్ గ్రామానికి చెందిన నందకుమార్ గత నెల 31న తప్పిపోయినట్లు ఎస్సై కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. నందకుమార్(35) మానసిక స్థితి బాగాలేదని, గత నెల ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరారైన బాలురలో ఒకరి ఆచూకీ లభ్యం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని నాగారంలోని జువైనల్‌హోం నుంచి పరారైన నలుగురు బాలురలో ఒకరి ఆచూకీ లభించిందని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహమ్మద్ ఒమర్ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన బాలుడి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు చెప్పారు. శుక్రవారం రాత్రి నలుగురు బాలురు పరారీ అయిన విషయం తెలిసిందే. ఇంకా ముగ్గురి ఆచూకీ లభించాల్సి ఉన్నట్లు చెప్పారు.

బహిరంగంగా మద్యం తాగిన ముగ్గురిపై కేసు

గాంధారి: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండల కేంద్రం శివారు ప్రాంతంలో బహిరంగంగా మ ద్యం తాగుతున్న గాంధారికి చెందిన భాస్కర్, ఎండీ మహమ్మద్, గుజ్జుల్ తండాకు చెందిన జరుపులా ప్రకాశ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మన ఊరు – మన బడి పనులు పూర్తి చేయాలి

కామారెడ్డి టౌన్ : మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపడుతున్న పాఠశాల భవనాల నిర్మాణం పనులను మే 31 లోపు పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల సంస్థ(టీఎస్ ఈడబ్ల్యూడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో బుధవారం ఆయన ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో మన ఊరు మన బడి పనులపై సమీక్ష నిర్వహించారు. అన్ని భవనాల్లో మౌలిక వసతులు కల్పించే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని 23 మండలాల్లో నిర్మిస్తున్న భవన నిర్మాణాల పురోగతిపై ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులను ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలు, రక్షణ గోడ నిర్మాణం పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీఈవో రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి, రాజంపేట, గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, తిమ్మక్ పల్లి, దేవునిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను బుధవారం శ్రీధర్ రెడ్డి తనిఖీ చేపట్టారు. గ్రీన్ చాక్ బోర్డ్స్, డబుల్ డెస్కులు, పెయింటింగ్స్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.



దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్న టీఎస్ఈడబ్ల్యూడీసీ రాష్ట్ర చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

రాజంపేట: రాజంపేటలోని ప్రాథమిక, బాలికల ఉన్నత పాఠశాలలను ఎస్ఈడబ్ల్యూడీసీ రాష్ట్ర చైర్మన్ శ్రీధర్ రెడ్డి సందర్శించారు.అదనపు కలెక్టర్ వెంటేష్ ధోత్రె, డీఈవో రాజు, ఎంఈఓ రామస్వామి, ఈఈ దేవిదాస్ పాల్గొన్నారు.